కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం : జడ్జి శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

కక్షిదారులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేలా కేసులను సత్వరం పరిష్కరించడమే లోక్ అదాలత్ లక్ష్యమని అదనపు జిల్లా జడ్జి శైలజ పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శైలజ మాట్లాడుతూ కక్షిదారులను పిలిపించి ఆయా సమస్యలను తెలుసుకుని ఇరు వర్గాల వారితో చర్చించి 8 కేసులను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. ప్రజలు కక్షలకు పోకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ప్రస్తుతం కేసులతో సతమతమవుతున్న వారు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎజిపి శ్రీనివాస్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగప్ప, సుదర్శన్, న్యాయవాదులు నాగభూషణరావు, కృష్ణారెడ్డి, నాగరాజు, రామిరెడ్డి, సుధాకర్, సంతోషి కుమారి, సంపత్ కుమార్, లోక్ అదాలత్ శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

టిడిపికే పట్టం



విజేత ..
భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

- 7543 ఓట్ల మెజార్టీతో భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గెలుపు
- రీ కౌంటింగ్‌కు పట్టుబట్టిన వైసిపి
- అంగీకరించని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి
- టిడిపి గెలుపుతో తమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మూడు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటర్లు టిడిపికి పట్టంగట్టారు. ఓట్ల లెక్కింపు ఫలితాలు శనివారం రాత్రికి పూర్తయ్యాయి. ఈ ఎన్నికలో 7543 ఓట్ల మెజార్టీతో టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిపై విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ఆద్యంతం హోరాహోరీగా, ఉత్కంఠభరితంగా సాగింది. ప్రారంభం నుంచి టిడిపి, వైసిపిల మధ్య నువ్వా...నేనా అన్నట్టుగానే ఓట్ల లెక్కింపు జరిగింది. ద్వితీయ ఓట్ల బదలాయింపులో పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు ఓట్లలో 9886 ఓట్లు టిడిపికి లభించడంతో విజయం సులభమైంది.

ఆద్యంతం పోటాపోటీ...

నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,45,687 ఓట్లు పోలవగా 11 రౌండ్లలో జరిగిన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు 19,239 ఓట్లు అనర్హమైనవి తొలగించారు. మిగిలిన 2,26,448 ఓట్లను లెక్కించారు. 49 మంది అభ్యర్థులు పోటీపడిన ఈ ఎన్నికల్లో ముగ్గురి మధ్యనే ప్రధానంగా ఓట్ల పంపిణీ జరిగింది. ఇందులో ప్రధానంగా వైసిపి, టిడిపిలకే పోటాపోటీగా ఓట్లు వచ్చాయి. ప్రథమ ప్రాధాన్యత ఓట్లు పూర్తయ్యే సమయానికి వైసిపి అభ్యర్థి వెన్నపూస గోపాల్‌రెడ్డికి 95,659 రాగా, టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి 94,149 ఓట్లు వచ్చాయి. దీంతో వైసిపికి 1820 ఓట్ల మెజార్టీ లభించింది. ఇదే మెజార్టీ ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ కొనసాగింది. అధిక ఓట్లు సాధించిన వారిలో నాలుగో వ్యక్తిగానున్న నగరూరు రాఘవేంద్ర ఎలిమినేషన్ సమయంలో టిడిపి అభ్యర్థికి వైసిపికి మించి స్వల్ప మెజార్టీ వచ్చింది. పిడిఎఫ్ అభ్యర్థి నాగరాజు ఎలిమినేషన్ సమయంలో జరిగిన ద్వితీయ ఓట్ల లెక్కింపుతో టిడిపికి పూర్తి స్థాయి విజయానికి చేరింది.

రీకౌంటింగ్‌కు వైసిపి పట్టు...

ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత రీకౌంటింగ్ చేయాలని వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి పటుబట్టారు. అలా చేయడానికి వీల్లేదని ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి చెప్పడంతో చేయాల్సిందేనంటూ కౌంటింగ్ కేంద్రం ఆవరణంలో బైటాయించి నిరసన తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే వైసిపి నాయకులు కౌంటింగ్‌లో ఏదోక వివాదాన్ని రాజేసే ప్రయత్నం చేస్తూ వచ్చారు. గురువారం రాత్రే కొంత మంది యువకులను తీసుకొచ్చి ఎటువంటి కారణం లేకుండానే ఘర్షణకు దిగారు. దీంతో వారిని పోలీసులు బయటకు తీసుకెళ్లారు. ఆ తరువాత శుక్రవారం రాత్రి కూడా వైసిపి అభ్యర్థి టిడిపి నాయకులు కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చారంటూ వివాదానికి దిగారు. కౌంటింగ్ తరువాత తిరిగి రికౌంటింగ్ చేయాలని పట్టుబట్టారు. అయితే ఎన్నికల అధికారిగానున్న అనంతపురం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఇందుకు అంగీకరించలేదు. టిడిపి అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి గెలిచినట్లు ప్రకటించారు.

గోరంట్లలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి అభిమానులు

చెల్లని ఓట్లు ఎనిమిది శాతం

పశ్చిమ రాయల సీమ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో మొత్తం 3.30 లక్షల ఓట్లు ఉన్నాయి. ఇందులో 74 శాతం అంటే 2,45,687 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 19,239 ఓట్లు చెల్లని ఓట్లుగా కౌంటింగ్‌లో తొలగించారు. పోలైన ఓట్లలో సుమారు ఎనిమిది శాతం ఓట్లు చెల్లని ఓట్లుగా ఉన్నాయి. వీటిల్లో చూసినప్పుడు పట్టభద్రులు ఓటింగ్ సరైన పద్ధతిలో చేయకపోవడంతోనే చెల్లని ఓట్లుగా నిర్ధారించారు. ఇందులో జరిగిన తప్పిదాలు చూస్తే ఒకే ప్రాధాన్యతలు ఇద్దరికివ్వడం, మరికొంత మంది అభ్యర్థుల ఎదుట సంఖ్యలు కాకుండా టిక్కులు పెట్టడం, మరికొంత మంది బ్యాలెట్ పేపరును మడిచి దానిపై తాము వేయాలనుకున్న అభ్యర్థులకు సంబంధించిన అంకెలను వేసియున్నారు. ఇటువంటి కారణాలతో వేసిన ఓట్లు చెల్లకుండా పోయాయి.

పోలీసు భారీ భద్రత

ఓట్ల లెక్కింపు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీగా సాగుతుండటంతోపాటు, రెండు పర్యాయాలు వివాదాలు చెలరేగడంతో పోలీసు భద్రతను కౌంటింగ్ కేంద్రం వద్ద భారీగా ఏర్పాటు చేశారు. చిన్న ఘటన జరిగిన వెంటనే వారిని బయటకు పంపించే విధంగా పోలీసు భద్రతను కట్టుదిట్టడం చేయడంతో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగింది.

అపార నష్టం

గాలివాన బీభత్సం - నేలకొరిగిన పంటలు

పెనుకొండలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

ప్రజాశక్తి-పెనుకొండ

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతులకు అపార నష్టం కలిగింది. మండలంలోని గొల్లపల్లి, దుద్దెబండ, మోటువారిపల్లి తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

చెన్నేకొత్తపల్లి : మండలంలోని వెంకటంపల్లి, పూలేటిపల్లి, పయలబోయలపల్లి గ్రామాల్లో శుక్రవారం వీచిన అకాల వర్షానికి భారీగా పంట నష్టం సంభవించింది. గాలివాన బీభత్సానికి దాదాపు వందెకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో బీర, కాకర, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వెంటనే వ్యవసాయ అధికారులు స్పందించి పంట నష్టం అంచనాలు తయారు చేసి నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని కోరారు.

చెన్నేకొత్తపల్లిలో దెబ్బతిన్న బీర పంటలో రైతులు

అభివృద్ధి పాలన చేశాం

- కియా ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి
- వైసిపి పాలనలో ఉన్న పరిశ్రమలూ తిరోగమనం
- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

మోకాళ్లపై కూర్చొని వికలాంగుడితో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-తనకల్లు, నల్లచెరువు, కదిరి టౌన్, అర్బన్

టిడిపి హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి జరిగేలా పాలన సాగిందని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 46వ రోజు శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోకి చేరుకుంది. శుక్రవారం నాడు తనకల్లు మండలానికి చేరుకున్న యాత్ర శనివారం నుంచి చీకటిమానిపల్లిలో బస చేసిన ప్రాంతం నుంచి లోకేష్ పాదయాత్ర కొనసాగించారు. జిల్లాలో మొదటి రోజు తనకల్లు, నల్లచెరువు మండలాల పరిధిలో కొనసాగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా ఆధ్వర్యంలో లోకేష్‌కు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. లోకేష్ పాదయాత్ర చేస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రజలను పలకరిస్తూ, మాట్లాడుతూ ముందుకు నడిచారు. గిరిజన, దళిత కుటుంబ సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. తనకల్లు మండలం గంగసానిపల్లి వద్ద టమోటా రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో లోకేష్ ప్రసంగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎంతో కషి చేసిందన్నారు. ఆ కషి ఫలితమే పెనుకొండ వద్ద ప్రపంచ స్థాయి కియా కార్ల పరిశ్రమ ఏర్పాటు అయ్యిందన్నారు. జాకీ కంపెనీ వస్తే కమీషన్ల కోసం దానిని వైసిపి నాయకులు అడ్డుకున్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఐటీ పరిశ్రమను ఎంత అభివద్ధి చేశారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారాని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక పరిశ్రమలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నిరుద్యోగుల కోసం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, అత్తార్ చాంద్‌బాషా, తిప్పేస్వామి, తెలుగు యువత నాయకులు ఎస్.బాబ్జాన్, ఎంఎస్.రాజుతో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : తలమర్లవాండ్లపల్లి గ్రామపంచాయతీ ఎర్రగుంటపల్లి వద్ద శనివారం సాయంత్రం లోకేష్ పాదయాత్ర నల్లచెరువు మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర సందర్భంగా చిన్నపల్లోళ్లపల్లి వద్ద నారా లోకేష్ రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపిపి మాబు సాబ్, మాజీ జెడ్పిటిసి అబ్దుల్ ఖాదర్, నల్లచెరువు సింగల్ విండో మాజీ అధ్యక్షుడు తవలం వేణుగోపాల్, అంజనప్ప, సీనియర్ నాయకులు నాగభూషణ నాయుడు, లక్ష్మీపతి నాయుడు, తలమర్లవాండ్లపల్లి సర్పంచి హర్షవర్ధన్ నాయుడు, రమేష్ నాయుడు, మదన్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

ఎర్రగుంటపల్లిలో స్వల్ప ఉద్రిక్తత..జై జగన్ అంటూ వైసిపి నేతల నినాదాలు

నల్లచెరువు మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి గ్రామపంచాయతీ ఎర్రగుంటపల్లి వద్ద తనకల్లు నుంచి లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పాదయాత్ర ఎర్రగుంటపల్లి గ్రామం వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తవలం నాగభూషణ, మరి కొంతమంది జై జగన్ అని నినాదాలు చేశారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. వెంటనే పోలీసులు కలుగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

నేటి పాదయాత్ర ఇలా...

కదిరి టౌన్ : లోకేష్ పాదయాత్ర ఆదివారం 47వ రోజు నల్లచెరువు మండలంలో కొనసాగనుంది. ఉదయం 8గం॥లకు చినపిల్లోలపల్లి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుంది. 8-15కు సంజీవుపల్లిలో స్థానికులతో మాటామంతి, 10-05కు నల్లచెరువులో చేనేతలతో సమావేశం, 10-45కు ఘాజీఖాన్ పల్లి వద్ద స్థానికులతో మాటామంతి ఉంటుంది. 11-50కు పయాలవారిపల్లిలో భోజన విరామం, 2-25కు పయాలవారిపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుంది. 2-45కు నల్లచెరువు రైల్వేస్టేషన్ వద్ద స్థానికులతో మాటామంతి, 3గం॥లకు యువగళం పాదయాత్ర 600 కిలోమీటర్లకు చేరుతుంది. 3-25కు రత్నాలపల్లిలో కురుబ సామాజికవర్గీయులతో భేటీ, 4-05 గంటలకు బొమ్మిరెడ్డిపల్లిలో స్థానికులతో మాటామంతి నిర్వహిస్తారు. 4.40కు చిన్నయాళ్లంపల్లిలో 600 కిలోమీటర్ల పాదయాత్ర సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరణ చేశారు. 5గంటలకు జోగన్నపేట బహిరంగసభలో లోకేష్ ప్రసంగిస్తారు. 6 గంటలకు జోగన్నపేట విడిదికేంద్రంలో బస చేస్తారు.

పేదల ఇంట కన్నీటి వరద

- నిరుపేద కుటుంబాలను కబళించిన మృత్యువు - మృతులందరిదీ రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి
- ప్రాణాపాయ స్థితిలో చిన్నారి - పోట్లమర్రి ఘటనలో మృతుల కుటుంబాలను కదిలిస్తే ఒక్కోరిది ఒక దీనగాథ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఉదయాన్నే నిద్రలేవగానే ఏదో పనికి వెళ్లితేగానీ వారికి పూటగడవని పరిస్థితి. ఇంటిల్లిపాదిని పోషించుకునేందుకు రోజూ ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసుకుంటూ తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నవారే. అలాంటి కష్టజీవులను శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం మృత్యువు వెంటాడింది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఆరుగురు మృతిచెంది ఆయా కుటుంబాలను నిరాశ్రయులను చేసింది. మృతిచెందిన వారి కుటుంబాల బాధలు వింటుంటే గుండెలు తరుక్కుపోవాల్సిందే. బత్తలపల్లి మండలం పోట్లమర్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ గాథలు ఇలా ఉన్నాయి...

బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చెందిన బత్తలమల్లేష్ (47) వేల్పుమడుగు వద్ద ఉన్న రీలింగ్ ప్యాక్టరీలో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా మలేష్ బత్తలపల్లి నుంచి చికెన్ తీసుకుని ఆటోలో స్వగ్రామం పోట్లమర్రికి ఆటోలో బయలుదేరాడు. బత్తలపల్లి నుంచి ధర్మవరం వైపునకు వెళుతున్న ఆటో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొనడంతో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య నాగేంద్రమ్మ, కుమార్తెలు పుష్పలత, శిరీషా ఉన్నారు.

ధర్మవరం పట్టణం శాంతినగర్‌కు చెందిన హాజీపీరా (52) బత్తలపల్లిలోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే ప్రతిరోజులాగే పనులు ముగించుకుని ధర్మవరంకు వెళ్తున్న హాజీ పీరా ఆటో ఎక్కి ప్రమాదంలో మృతిచెందాడు. మృతునికి భార్య నూర్జాహాన్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ధర్మవరం మండలం దాసరి ఈశ్వరయ్య (38) గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో ఈశ్వరయ్య శుక్రవారం రాత్రి తాడిపత్రికి గొర్రెలను మేపేందుకు కూలిపనికి వెళ్లడానికి బయలుదేరివెళ్లాడు. అయితే బస్సు ఎంతసేపటికీ రాకపోవడంతో తిరిగి స్వగ్రామం గొట్లూరుకు ఆటోలో తిరిగి బయలుదేరాడు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. మతునికి భార్య లక్ష్మీదేవి, కుమార్తెలు సవిత, శ్రావణి, కుమారుడు మనీష్‌కుమార్ ఉన్నారు.

ధర్మవరం పట్టణం రాజేంద్రనగర్‌కు చెందిన మహమ్మద్ ఫయాజ్ (38) పోతుకుంట రోడ్డులో కూల్‌డ్రింక్ దుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈక్రమంలో తన కుమార్తె చిన్నారి షాహిస్తాను పిలుచుకుని కదిరిలో జరిగే శుభకార్యాయానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మహమ్మద్ ఫయాజ్ మృతిచెందాడు. షాహిస్తా పరిస్థితి విషమంగా ఉంది.బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

ముదిగుబ్బ మండలం నల్లకుంటపల్లి గ్రామానికి చెందిన గాలి నారాయణస్వామి(60) ధర్మవరంలోని ఖాదీ బండారు సొసైటీలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. పగలు స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేసుకునేవాడు. ఇందులో భాగంగానే శుక్రవారం స్వగ్రామానికి వెళ్లి తిరిగి బత్తలపల్లికి వచ్చి అక్కడి నుండి ఆటోలో ధర్మవరం బయలుదేరాడు. ఈ నేపథ్యంలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి కేశమ్మ, కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

ధర్మవరం కేతిరెడ్డికాలనీకి చెందిన నరసింహులు (45) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని ధర్మవరం బయలుదేరాడు. బయలుదేరే ముందు ఇంటికి ఫోన్ చేసి అరగంటలోపు వస్తానని చెప్పాడు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబలించింది. మృతునికి భార్య నాగమునేశ్వరి, కుమార్తెలు అమూల్య, అనూష, కుమారుడు సత్యలింగేశ్వర్ ఉన్నారు. వీరిలో అమూల్యకు వివాహం కాగా రెండవ కుమార్తె చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం అన్వేషణ చేస్తోంది. కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు.

ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న చిన్నారి

రోడు ప్రమాదంలో గాయపడిన చిన్నారి షాహిస్తా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్థానిక ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురంలోని సవేరా ఆస్పత్రికి తరలించారు. అక్కడ కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నట్టు బంధువులు తెలిపారు. కాగా గాయపడిన రంగస్వామి ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బులోరా వాహనం డ్రైవర్ కుమార్ నరసింహులు కూడా అనంతపురం ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు (పాతచిత్రం)

మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా : ఎమ్మెల్యే

బత్తలపల్లి మండలం పోట్లమర్రి రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి జగన్ రూ.5లక్షలు ప్రకటించినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాల పూర్తి విషయాలను తెలుసుకుని విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇందుకు సిఎం స్పందిస్తూ ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున చొప్పున రూ.30లక్షలు మంజూరు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు.

వైఎస్ఆర్ ఆసరాతో ఆర్థికాభివృద్ధి

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి కోసం అందిస్తున్న వైఎస్ఆర్ ఆసరా నిధులను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఎన్.నర్సయ్య సూచించారు. శనివారం రూరల్ మండలం కిరికెర పంచాయతీ వీవర్స్ కాలనీలో శ్రీనివాస గ్రామ సంఘం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఆసరాపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ఫైనాన్స్ శ్రీ రామిరెడ్డి, డిపిఎంలు ఎల్. హెచ్ రామ్మోహన్, నాగరాజు, ఎపిఎం రామకృష్ణ, వెలుగు సిబ్బంది ఆంజనేయులు, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపద కాపాడాలని వినతి

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లాలో వేలాది ఎకరాలలో ఉన్న అటవీ సంపదను కాపాడుటలో తమ వంతు చేయూత అందించాలని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ దక్షిణ భారతదేశ కార్యదర్శి, పర్యావరణ వేత్త డాక్టర్ అప్పన్న గారి భాస్కర్ నాయుడు సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్‌కు విన్నవించారు. ఈ మేరకు ఆయన శనివారం రత్నాకర్‌ను ఆయన నివాసంలో కలిసి సమస్యను విన్నవించారు. జిల్లాలో లక్షల కోట్లు అటవీ సంపద, వన్యప్రాణులు అగ్నికి ఆహుతి అవుతున్నాయన్నారు. జిల్లాలో 3,11,000 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయన్నారు. ప్రతి ఏటా వేసవిలో కొన్ని కోట్ల వన్య ప్రాణులు, మొక్కలు, చెట్లు, ఔషధ మొక్కలు కాలి బూడిద అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ సంరక్షణకు సంబంధిత అటవీ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. తాను ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకపోయిందన్నారు. ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి అటవీ సంపద కాపాడటానికి కృషి చేయాలని రత్నాకర్‌ను కోరారు.

టీచ్ హైస్కూల్ వార్షికోత్సవం

రొద్దం : విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి టీచ్ హైస్కూల్ పునాది లాంటిదని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని టీచ్ హై స్కూల్ 25 వార్షికోత్సవ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచి రూప హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఏదో ఒక రకంగా ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు. సూచించారు. అందుకు తాను, తన కూతురు రూప ఉదాహరణ అని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఆంజనరెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ పాఠశాల అభివృద్ధికి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధాన కారకులని అన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, పండిట్ జాన్ ప్రియానాన్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, టీచ్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువగళంతో యువకుల్లో ఉత్సాహం

కదిరి అర్బన్ : తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 46వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోకి చేరుకుంది. శుక్రవారం నాడు తనకల్లు మండలానికి చేరుకున్న యాత్ర శనివారం నుంచి చీకటిమానిపల్లిలో బస చేసిన ప్రాంతం నుంచి లోకేష్ పాదయాత్ర కొనసాగించారు. జిల్లాలో మొదటి రోజు తనకల్లు, నల్లచెరువు మండల పరిధిలో కొనసాగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా ఆధ్వర్యంలో లోకేష్‌కు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. లోకేష్ పాదయాత్ర చేస్తూ ఆయ ప్రాంతాల్లో ప్రజలను పలకరిస్తూ, మాట్లాడుతూ ముందుకు నడిచారు. ఆయా ప్రాంతాల్లో గిరిజన, దళిత కుటుంబ సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. లోకేష్ పాదయాత్ర సమయంలోనే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి విజయం సాధించారు. దీంతో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ పతకానికి ఈ ఎన్నికలే నిదర్శనం అని టిడిపి నాయకులు స్పష్టం చేశారు.

పాదయాత్రలో జనవాహిని

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PENUKONDA.
I.A.No:44/23 in O.S.No:49/2008.

Between:
Pedda Nagappa and others
...Petitioners/Plaintiffs
AND
R.Sankara Reddy and others
...Respondents/Defendants

పై నెంబరు I.A.44/23 లోని 35,36,37 ప్రతివాదులకు నోటీసు

To
R35) K.Nagamani W/o Late K.Eswarappa
R36) Swetha D/o Late K.Eswarappa
R37) K.Tagur S/o Late K.Eswarappa
D 35 to D 37 are residin at Gummaiahgavi Palli, Gorantla Mandalam.

ఇందుమూలముగా మీకు తెలియజేయడము ఏమనగా పై నెంబరు దావాలోని I.A.44/2023 లో మిమ్ములకు 23వ ప్రతివాది కె.ఈశ్వరప్ప వారసులుగా చేర్చుటకు గాను పై అర్జీని దాఖలు చేసినారు. సదరి విషయములై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు 23/03/2023 వ తేదిన ఉ॥10:30 గం॥లకు పై కోర్టులో ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ వాదనలను కోర్టు వారికి తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై అర్జీ నీ తీర్మానము చేయుదురని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(By Order of the Court)
వై.లక్ష్మీనారాయణ
వాదితరుపు వకీలు, పెనుకొండ

In the Court of the Senior Civil Judge: Hindupur
I.A.No.13/2021 I.A.143/2022 IN O.S.No.92/2014

Between:
1.R.Siva Reddy (Died) by his Lrs
Plaintiffs No-3 and 4
2.R.Bhaskar Reddy
3.Smt.R.Sarojamma
4.R.Bayapa Reddy
...Petitioners/Plaintiffs
And
1.Gangulamma and others
...Respondents/Defendants

Notice to Respondent No:14,16 and 17

1. Sankar Reddy, S/o Late Narayana Reddy, aged about 56 years, agriculturist, (R14)
2. Raja Gopal Reddy, S/o Late Narayana Reddy, Aged about 52 years, agriculturist, (R16), both are R/o. Palagala Palli Village, Chilamathur Mandalam.
3. Smt. Sujathamma, D/o Late Narayana Reddy, W/o Suryanarayana Reddy, aged about 50 years, House wife, R/o. Madhugire Palli, Chilamathur Mandal. (R17).

The Plaintiffs filed the above suit for partition of the suit schedule properties against you respondents No.14,16, and 17 and others on the file of Senior Civil Judge court Hindupur and also filed I.A.13/2021 to set aside the abetment and I.A.143/2022 for adding of parties the same is posted to 29-03-2023 for your appearance in person or through an advocate. If you failed to appear on that day, you will be set ex-parte and the matter will be decided in your absence.

(By the Order of Court)

C.RAMACHANDRA REDDY
Advocate for Plaintiffs
Hindupur.

'సత్యసాయి' కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

విలేకరుల సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు ఓబులు, తదితరులు

సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సత్యసాయి నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు విమర్శించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో సత్యసాయి వాటర్ సప్లయ్ పథకం కింద దాదాపు 22 ఏళ్లుగా 572 మంది కార్మికులు 750 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారన్నారు. అలాంటి కార్మికుల సమస్యలను ప్రభుత్వం పెడచెవిన పెట్టి చోద్యం చూడటం బాధాకరమన్నారు. ముఖ్యంగా 5 నెలల బకాయి జీతాలు, పీఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ పథకాన్ని విభజించి ముక్కలు చేసి అధికార పార్టీ కార్యకర్తలకు ఉపాధిగా అందించాలన్న ప్రతిపాదనను వ్యతిరేకించాలన్నారు. మార్చి నుంచి వేతనాలు పెంచాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలని, ప్రతినెలా 5వతేదీలోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అమరాపురం : మండలంలోని శ్రీరామ్ రెడ్డి రక్షిత తాగునీటి పథకం స్కీం వర్కర్లు శనివారం సమ్మెబాట పట్టారు. నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగారు. కార్మికుల వేతనాలు అందకపోవడంతో సమ్మె బాట పట్టినట్లు కార్మిక సంఘం నాయకులు హనుమంతరాయ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రెండు నెలల వేతనాలతో పాటు పిఎఫ్ బకాయిలు, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలన్నారు. ఈకార్యక్రమంలో శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికులు పాల్గొన్నారు

చిన్నారుల ఆలోచనలకు ప్రతిరూపాలు అద్భుత ప్రయోగాలు

ప్రజాశక్తి-హిందూపురం

చిన్నారుల ఆలోచనలకు ప్రతిరూపాలు వారు చేసిన అద్భుత ప్రయోగాలని ప్రవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని అల్ హిరా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పాంచజన్య శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రహమత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలను వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ రహమత్ మంచి ప్రయోగాలు చేసిన విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు వేణుగోపాల్, రీయాజ్, పాఠశాల కరస్పాండెట్ రీయాజుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి మెమోంటో అందిస్తున్న దృశ్యం

పాదయాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు

కదిరి టౌన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో టిడిపి కదిరి పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు కష్ణమూర్తి, లోకేష్‌తో పాటు ఆయన వెంట నడిచారు. బంగారు కష్ణమూర్తి పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకులు కార్యకర్తలకు ప్రజలకు తనవంతుగా 5000 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి దాతృత్వం చాటుకున్నారు.

బంగారు కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ వాహనం

సరిహద్దు చెక్‌పోస్టుల్లో పటిష్ట భద్రత : కలెక్టర్

చిలమత్తూరు : శ్రీ సత్యసాయి జిల్లా సరిహద్దు ప్రాంతాలలో నిరంతరం పటిష్టమైన భద్రత, ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నట్లు కర్నాటక రాష్ట్రానికి సంబంధించిన అధికారులకు కలెక్టర్ బసంత్‌కుమార్ వివరించారు. కర్నాటక రాష్ట్ర ఎన్నికల సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రవాణా, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో ఎన్నికల ఎంఎంసి అమలు తీరుపై తుమకూరు, చిక్ బళ్లారి ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశాన్ని శనివారం ఆరాష్ట్ర ఎన్నికల అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిక్‌బల్లాపూర్ జిల్లా కలెక్టర్ ఎన్ ఎం నాగరాజు, తుముకూరు జిల్లా కలెక్టర్ వైఎస్ పాటిల్, శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ పిఎస్,గిరీష్, ఎస్పీలు, డిఎల్ నగేష్, రాహుల్ కుమార్, రాహుల్ దేవ్ సింగ్, హర్షవర్ధన్ రాజు, సీఈవోలు టిజిఎన్ ప్రకాష్, విద్యాకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నాటక రాష్ట్ర ఎన్నికల అధికారులు మాట్లాడుతూ త్వరలో కర్ణాటక రాష్ట్ర ఎన్నికల రానున్నాయని చెప్పారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా సరిహద్దు జిల్లాల అధికారులు సహాయ సహకారాలు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రానికి సత్య సాయి జిల్లాలో 15 మండలాల సరిహద్దులు ఉన్నాయని ప్రతి మండలంలో ప్రత్యేక చెక్ పోస్ట్ లు, గట్టి భద్రత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. త్వరలో జిల్లాలోని రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని అన్నారు. కుడుములకుంట, నాగరైగిరి, టిబి క్రాస్. జి మద్దేపలిచెక్ పోస్టలలో, ఎక్సైజ్ శాఖ, రెవెన్యూ శాఖ టీములు ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యచరణ ప్రణాళికలపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టీఎస్ చైతన్. పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవోలు పుట్టపర్తి భాగ్యరేఖ, కదిరి డివిజన్ రాఘవేంద్ర, మదనపల్లి డివిజన్ ఎన్ఎస్ మురళి, చిలమత్తూరు, బాగేపల్లి, చింతామణి, గౌరీ బిదనూర్ రవాణా, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలివ్వకపోతే ఎలా బతకాలి..?

చిలమత్తూరు : గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు, సబ్బు, నూనె, చెప్పులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. చిలమత్తూరు ఎంపీడీవో కార్యాలయం ముందర పచ్చగడ్డి తింటూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇఒఆర్‌డి శకుంతలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు రమేష్, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చిలమత్తూరు మండలంలో గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్ కార్మికులు దాదాపు 80 మంది ఉన్నారన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులు 12 నెలల నుండి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవటం దారుణమన్నారు. వేతనాలు రాక వారి కుటుంబసభ్యులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

రాష్ట్రస్థాయి విజ్ఞాన సదస్సుకు తంగేడుకుంట ఉన్నత పాఠశాల ప్రాజెక్ట్ ఎంపిక

ఓబుల దేవర చెరువు : మండలంలోని తంగేడుకుంట ఉన్నతపాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు 2021 -22 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెర్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శంకర్‌బాబు తెలిపారు. గైడ్ టీచర్స్ ఎస్.మహేంద్ర రెడ్డి, మనోహర్ నాయక్ ఆధ్వర్యంలో కార్తీక్ అనే విద్యార్థి మూగవారి సైగలను మాటల రూపంలోకి మార్చే గ్లౌజ్ ప్రాజెక్టును రూపొందించాడు. ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈ పరికరంలో సైగ లకు అనుగుణంగా స్పందించేటువంటి సెన్సార్లు అమర్చబడి ఉంటాయన్నారు. మూగవారి సైగలను ఇది మాటల రూపంలోకి మార్చి వారి అవసరాలను ఇతరులకు తెలియజేసేలా చేస్తుందని చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా నుండి ఎంపికైన 10 ప్రాజెక్టుల్లో ఇది ఒకటి అని అన్నారు. ఈనెల 23, 24వ తేదీల్లో ఆన్లైన్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ప్రాజెక్టును ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రమణ నాయక్, శివ శంకర్, సుధాకర్ రెడ్డి, ఎల్లప్ప, లక్ష్మీదేవి, జనార్ధన, శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ బాబు తదితరులు గైడ్ టీచర్లను, విద్యార్థిని అభినందించారు.

టిడిపి నాయకుల సంబరాలు

ధర్మవరంలో టిడిపి నాయకుల సంబరాలు

పుట్టపర్తి అర్బన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి మద్దతుదారుడు భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి విజయం పట్ల టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని హనుమాన్ సర్కిల్ లో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు ధారపనేని చంద్రశేఖర్, ఓబులేసు, సుబ్రహ్మణ్యం, ఊరు వాకిలి సురేష్, గుట్లపల్లి గంగాధర్, వెంకటేశు, సత్యనారాయణ, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమి రెడ్డి రాంభూపాల్ రెడ్డి గెలవడంతో మండల కేంద్రంలో టిడిపి నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, పెనుకొండ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్ నరహరి, రొద్దం మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, హరీష్, మురళి, పవన్, సాయి కుమార్, చంద్ర శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి విజయం సాధించడం పట్ల పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మునిమడుగు చిన్నవెంకటరాముడు, సుబ్బరాయుడు, హుజూర్, పాలడుగు చంద్ర, సిద్దయ్య, బోయ నాగరాజు, బోయ గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి గెలుపుతో మండల కేంద్రంలో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్ రెడ్డి, సాకే యశోద నాయుడు, లావణ్య గౌడ్, కాయగూరల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : పట్టభద్రుల టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్‌గోపాల్‌రెడ్డి విజయం పట్ల మండలం కేంద్రంలో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయప్ప, ఆనంద్ కుమార్, లలితమ్మ, నాగలింగారెడ్డి, మాలక్క, రమేష్, రవి ప్రభాకర్ రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపికి చెందిన భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి గెలుపొందడం పట్ల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు నాలుగు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు వెంకటరమణప్ప, రిటైర్డ్ టీచర్ నాగేందర్, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించడం పట్ల మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు విజయోత్సవాలను చేసుకున్నారు. మండల పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మామిళ్ళకుంట క్రాస్, పెడపల్లి తదితర గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పెడపల్లి గ్రామంలో తెలుగుదేశం నాయకులు శ్రీరామ నాయక్ , నిడిమామిడి మాజీ ఎంపీటీసీ ఎర్రప్ప, పైపల్లి సర్పంచి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. మామిల్లకుంట క్రాస్ సమీపంలో వెంకట గారి పల్లి సర్పంచి లక్ష్మీదేవి ఓబులేసు, ఉపేంద్ర, పుల్లప్ప, చంద్రశేఖర్ నాయుడు, ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో తెలుగు యువత నాయకులు అంబులెన్స్ రమేష్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు స్థానిక పార్టీ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధి లింగప్ప, నీరుగంటి చంద్ర, రామకృష్ణ, సూరి, అశ్వర్ధ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందడంపై ఆపార్టీ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా పట్టణ ప్రధాన రహదారుల్లో టిడిపి శ్రేణులు బాణాసంచా పేల్చారు. అదేవిధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, బీవీ, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, శీలామూర్తి, అంబటి సనత్, చిగిచెర్ల రాఘవరెడ్డి, దేవరకొండ రామకృష్ణ, కృష్ణాపురం జమీర్ అహమ్మద్, అత్తర్ రహీం, కరెంట్ ఆది, బొట్టు కిష్ట, గోసల శ్రీరాములు, గొట్లూరు రహీం, లోకేష్, కేతినేని రాజ, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వృద్ధురాలు ఆత్మహత్య

బత్తలపల్లి : అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధురాలు సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కూనమనేని వెంకటేష్ భార్య లక్ష్మీదేవి (75) ఆరు నెలలుగా తీవ్రమైన దగ్గు, ఆస్తమాతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూపర్ వాస్మోల్ తాగి ఆపస్మారక స్థితికి చేరుకుంది. గమణించిన బంధువులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషయమించి శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మడకశిరలో చోరీ

మడకశిర : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలోని సదాశివపురంలో నివాసం ఉన్న అంగన్వాడీ టీచర్ సాకమ్మ ఇంటిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. సాకమ్మ గృహం జనావాసాలకు దూరంగా ఉంది. శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరా లేకపోవటంతో సమీపంలోనే ఉన్న తనకు చెందిన మరో ఇంటిలో కుటుంబ సభ్యులతో కలసి నిద్రించింది. గమనించిన దుండగులు రాత్రి ఇంటి తలుపులు పగలగొట్టి ఇంటిలో ఉన్న 20వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. ఇదే సమయంలో అదే కాలనీలో మరో నాలుగు ఇళ్లలో దోపిడీకి యత్నించారు. తలుపు ధ్వంసం చేసే శబ్దం విన్న లోపల ఉన్న వారు గట్టిగా కేకలు వేసి బయటికి రావడంతో దొంగలు కొండ ప్రాంతంలోనికి పరుగులు తీసినట్లు ఆ కాలనీకి వాసులు తెలిపారు. వారం వ్యవధిలోని పట్టణంలో దాదాపు పది ఇళ్లపై దొంగలు దోపిడీకి పాల్పడి ఐదు ఇండ్లలో చోరీ చేశారు. దీంతో రాత్రి అయితే చాలు పట్టణవాసులకు దొంగల దెబ్బకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఇళ్లల్లో ఉంటే ఉక్క, పోత, ఇంటి బయట, మేడపైన పడుకుందామంటే దొంగల బెడద వెంటాడుతుండడంతో భయాందోళన చెందుతున్నారు. దీనికి తోడు గత కొద్ది రోజులుగా రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు గస్తీని ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే ఆరుగురి మృతికి కారణమా..?

బత్తలపల్లి : మండల పరిధిలోని పోట్లమర్రి సమీపంలో బత్తలపల్లి–ధర్మవరం రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదానికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్షులు.. క్షతగాత్రులు తెలిపిన వివరాల మేరకు...

గొట్లూరు గ్రామానికి చెందిన రంగస్వామితోపాటు డ్రైవర్‌తో కలిసి 8మంది ఆటో ఎక్కారు. అయితే ఇంకా కొంతమంది ఎక్కాలని డ్రైవర్ నరసింహులు ఆటోను ముందుకు.. వెనక్కు తిప్పసాగాడు. దీంతో అప్పటికే ఆటోలో ఉన్న వారు డ్రైవర్‌పై విసుక్కున్నారు. 'ఎక్కింది చాలు.. ఆటో పోనివ్వు..' అంటూ ఒత్తిడి చేశారు. చేసేదిలేక డ్రైవర్ విసుక్కుంటూనే ఆటోను కుడివైపునకు తిప్పాడు. దీంతో రెప్పపాటులో వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం బలంగా ఢీకొంది. దీంతో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు ఆసుపత్రిలో మృతిచెందారు. గాయపడిన ఫయాజ్, షాహిస్తా, రంగస్వామితో పాటు తాడిమర్రి మండలం నార్మెంపల్లి గ్రామానికి చెందిన బొలేరో డ్రైవర్ నరసింహులును ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

కాగా ఈ ప్రమాదంలో తండ్రి మృతిచెందగా, కూతురి పరిస్థితి విషయంగా ఉన్న ఘటన చోటు చేసుకుంది. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ధర్మవరం పట్టణం రాజేంద్రనగర్‌కు చెందిన ఫయాజ్ (50) మృతిచెందాడు. కుమార్తె షాహిస్సార్ పరిస్థితి విషమంగా ఉంది. ఫయాజ్ తన కుమార్తె చిన్నారి షాహిస్తాను పిలుచుకుని కదిరిలో జరిగే శుభకార్యాయానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మహమ్మద్ ఫయాజ్ మృతిచెందాడు. షాహిస్తా పరిస్థితి విషమంగా ఉంది.

మృతదేహాలను వాహనాల్లోకి ఎక్కించిన వైసిపి

ప్రమాద స్థలంలో నలుగురు మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో ఆయా మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించాల్సి ఉండగా మృతదేహాలను వాహనాల్లో ఎక్కించేందుకు స్థానికులు ఎవరూ ముందుకు రాలేదు. విషయం తెలుసున్న వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి స్వయంగా పోలీసులకు సహకారం అందిస్తూ మృతదేహాలను వాహనాల్లోకి ఎక్కించారు. దీంతో మరికొందరు ముందుకొచ్చారు.

వైసిపి నేతల నివాళి

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బత్తల మల్లేసు (48) మృతదేహానికి వైసిపి నేతలు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లేసు వేల్పుముడుగు క్రాస్ వద్దనున్న ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోట్లమర్రి గ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు హనుమంతురెడ్డి, వేల్పుమడుగు దామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతునికి భార్య నాగేంద్రమ్మతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి : సిపిఎం

ధర్మవరం : పోట్లమర్రి రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు చెందిన వ్యక్తులు మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుల్లో ఎక్కువగా కుటుంబ పెద్దలు మృతిచెందడంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ తిప్పేనాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిటిఐయు నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఎల్.ఆదినారాయణ, తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

పోట్లమర్రి ఘటన బాధాకరం : చిలకం

ధర్మవరం టౌన్ : బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటన పట్ల జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం ఉదయం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా చిలకం మాట్లాడుతూ పోట్లమర్రి ఘటనలో ఆరుగురు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణమే రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం..

బత్తలపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామని ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రమాదాలు జరిగితే తాను ఒక్కడినే నష్టపోవడమేకాక ప్రయాణికులు, కుటుంబ సభ్యులు నష్టపోతారన్న విషయాలు వివరిస్తామన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి

హిందూపురం : నిరుద్యోగ యువతీ, యువకులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపన కోసం ముందుకు రావాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య పిలుపునిచ్చారు. శనివారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ యువకులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో నరసయ్యతో పాటు పిఎం ఇజిపి సహాయ సంచాలకులు ఐజయ, లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయినాథ్ రెడ్డి, పరిశ్రమల స్థాపన అధికారి ఎమ్‌డి బాషా, డిఆర్‌డిఎ, డిపిఎం రామ్ రెడ్డి, మెప్మా అధికారి హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపన కోసం ముందుకు వస్తే పెట్టుబడిలో 15 నుంచి 35 శాతం వరకు రాయితీ లభిస్తుందన్నారు. కనీస విద్యార్హత ఎనిమిదవ తరగతి ఉత్తీర్ణత సాధించి 18 సంవత్సరాలు పైబడిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు.